క్లుప్తంగా

ఉపాధి పథకాలను వినియోగించుకోవాలి



పనులు ప్రారంభిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధిహామీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లంపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీలో మేకలు, పశువులషెడ్ల నిర్మాణ పనుల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హుల కు సబ్సిడీ పథకాలు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీడీ గోవిందారావు, ఏపీవో జయదేవ్, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కుంటాల: మండలకేంద్రంలోని శ్మశానవాటిక వద్ద దాసరి బూలింగు అనే రైతుకు చెందిన గేదె గురువారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేత కోసం వెళ్లి వస్తుండగా గేదెలు పోట్లాడుకోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గేదె విలువ రూ.40వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. జేఎల్ఎం హఫీజ్, సిబ్బంది శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు.

మిత్రుడికి ఆర్థికసాయం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన రమణకు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. 1989–90లో రమణతో కలిసి మామడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్రులు శుక్రవారం అతడి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తమ వంతుగా రూ.తొమ్మిది వేలను రమణకు అందజేశారు. భవిష్యత్తులోనూ ఆర్థికసాయం అందిస్తామన్నారు. రాజన్న, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, గంగన్న, సనత్, శివరాం ఉన్నారు.

'పసుపు రైతులను ఆదుకోవడంలో విఫలం'

ఖానాపూర్: పసుపు రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని బహుజన కూలీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపుల వెంకన్న అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంటకు మార్కెట్‌లో మద్దతు ధర లేక రైతులు విలవిలలాడుతున్నారని పేర్కొన్నారు. వ్యాపారుల మాయాజాలం కారణంగా మార్కెట్‌లో పసుపు క్వింటాలుకు రూ.6వేలకు మించని పరిస్థితి నెలకొందన్నారు. మద్దతు ధర అందించకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అక్కకొండ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగపూర్ గ్రామాల సమీపంలో జరిగే అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1 నుంచి ఏడో తేదీవరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని.. భక్తులు భారీగా తరలిరావాలని లక్ష్మీసాగర్ ఉప సర్పంచ్ ముడికే మల్లేశ్‌యాదవ్ తెలిపారు.

సన్మానం

కుంటాల: గతేడాది పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని ఓలా ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనీష్‌ఫాతిమా మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కుంటాలలో విద్యార్థులతో భోజారెడ్డి

కుంటాల : పదోతరగతి విద్యార్థులకు ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు బద్దం భోజారెడ్డి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని ఓలా ఉన్నత పాఠశాలకు చెందిన 24 మంది, కుంటాల ఉన్నత పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు కష్టపడి మంచి మార్కులు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజేశ్వర్, గజపెల్లి నర్సయ్య, ఎంపీటీసీ కట్ట రవి, బీజేపీ నాయకులు గజేందర్, తాటి శివ, సాధు ప్రభాకర్, ప్రశాంత్, తదితరులున్నారు.

అంగన్‌వాడీల్లో ఆకుకూరల సాగు

- సత్ఫలితాలిస్తున్న కిచెన్‌గార్డెన్ల ఏర్పాటు
- సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జిల్లా వివరాలు..

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేసినవి
ముధోల్	180	162
భైంసా	205	114
ఖానాపూర్	244	98
నిర్మల్	297	150



మామడ మండలం పరిమండల్ అంగన్‌వాడీ కేంద్రంలో పాలకూర సాగు

లోకేశ్వరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్లు(పెరటి తోటలు) సత్ఫలితాలను ఇస్తున్నాయి. రసాయనాల జోలికి వెళ్లకుండా సేంద్రియ విధానంలో పండించిన ఈ ఆకుకూరలు వండి కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పోషకాహారం అందిస్తున్నారు.

జిల్లాలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలో ముధోల్, భైంసా, ఖానాపూర్, నిర్మల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 926 ఉన్నాయి. వాటిలో మేజర్ అంగన్‌వాడీ కేంద్రాలు 816 ఉండగా.. మినీ కేంద్రాల సంఖ్య 110. అందులో 61,998 మంది చిన్నారులు, గర్భిణులు 6,678 మంది, బాలింతలు 6132 మంది కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. లబ్ధిదారులకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద ఒకపూట భోజనంతోపాటు గుడ్డు, పౌష్టికాహారం అందుతోంది.

రెండేళ్ల కిందట శ్రీకారం..

లబ్ధిదారులకు తాజా ఆహారం అందించేందుకు.. మరోవైపు కూరగాయల కొనుగోలులో ఇబ్బందులను దూరం చేసేందుకు 2020లో జిల్లాలోని అంగన్‌వాడీల్లో ఆకుకూరల సాగుకు శ్రీకారం చుట్టారు ఐసీడీఎస్ అధికారులు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలున్న చోట కూరగాయల సాగు చేపట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు. తాజా ఆహార పదార్థాలు వండి పెడుతుండటంతో పోషకాలు సైతం సమృద్ధిగా అందుతున్నాయి.



లోకేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో టమాటా సాగు

వివిధ రకాల కూరగాయల పెంపకం

అంగన్‌వాడీ కేంద్రాల్లోని కిచెన్‌గార్డెన్‌లో టమాటా, బీన్స్, తెల్ల బబ్బెర్లు, బీర, బెండ, వంకాయ, సోరకాయ పంటలను సేంద్రియ పద్ధతిలో పెంచుతున్నారు. మెంతికూర, పాలకూర, బచ్చలి, తోటకూర, కొత్తిమీర, కరివేపాకుతోపాటు నిమ్మ, ఉసిరి మొక్కలు పెంచుతున్నారు. వీటి నిర్వహణను సిబ్బందే చూసుకుంటున్నారు.

ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు..

చిన్నారులు ఎక్కువ మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. కేంద్రాల్లో అందించే పోషకాహారంతోపాటు ఇంటి దగ్గర పిల్లలకు అదనంగా ఇస్తే సమస్యను అధిగమించొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది పోషణమాసంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో అతి తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారులు 1022 మంది.. పోషణ లోపం ఉన్నవారు 1,116 మంది ఉన్నట్లు గుర్తించారు.

ఆవరణలో సాగు



అంగన్‌వాడీ భవనం పక్కనున్న స్థలంలో కూరగాయలను సాగు చేస్తున్నాం. రసాయనాల జోలికి వెళ్లకుండా టమాటా, వంకాయ, ఆకుకూరలను పండించి పిల్లలకు వండి పెడుతున్నాం. ఎత్తు సరిపడ బరువులేని పిల్లల పోషణపై దృష్టి సారిస్తున్నాం.
– ఫరాణ, అంగన్‌వాడీ టీచర్, బామ్ని(కె),లోకేశ్వరం

పోషకాహారం అందించేందుకే..

లబ్ధిదారులకు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలున్న చోట కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేశాం. అన్ని రకాల ఆకుకూరలను పెంచుతున్నాం. నిర్వహణ బాధ్యత కూడా సిబ్బందే చూసుకుంటున్నారు. ఆరోగ్యంగా లేని వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.
– విజయలక్ష్మి, జిల్లా శిశుసంక్షేమ అధికారి

చదువుతోనే గుర్తింపు, గౌరవం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీమెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి

భైంసాటౌన్: చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు దక్కుతాయని..విద్యార్థులు కష్టపడి బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీఈవో రవీందర్ రెడ్డితో కలిసి భైంసాలోని పులేనగర్ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 2500 పుస్తకాల వరకు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి బాగా చదవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాశ్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, రమేశ్ మాశెట్టివార్, ఆసిఫ్, రాము, తదితరులున్నారు.

కల్యాణ మండపానికి ప్రొసిడీంగ్ అందజేత

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామంలోని నిర్మించే కల్యాణ మండపానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీని శుక్రవారం దేగాంలోని తన నివాసంలో సుంక్లి గ్రామస్తులకు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కార్యదర్శి హరీశ్, వీడీసీ పెద్దలు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



భైంసాలోని పాఠశాలలో ప్రధాని ప్రసంగం వింటున్న విద్యార్థులు, బీజేపీ నాయకులు

భైంసాటౌన్: విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంత మనసుతో పరీక్షలు రాయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, పరీక్షా పే చర్చ జిల్లా కోఆర్డినేటర్ తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పరీక్షా పే చర్చలో భాగంగా ప్రధాని మోదీ విద్యార్థులతో వర్చువల్ విధానంలో ప్రసంగించారు. ఈ మేరకు పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రధాని ప్రసంగం వీక్షించారు. బీజేపీ పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, నాయకులు నాగనాథ్, పోశెట్టి, గౌతంపింగ్లే ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో 250 మంది విద్యార్థులు ప్రధాని మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని తిలకించారు. ఈసందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడారు. విద్యార్థులు ఫోన్‌కు దూరం ఉండి చదువుకోవాలన్నారు. అమ్మానాన్నల ఆశయాలను నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, నియోజకవర్గ కోకన్వీనర్ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: సోన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధాని మోదీ ప్రసంగం వీక్షించారు. ప్రధానోపాధ్యాయుడు గజ్జారాం మాట్లాడుతూ ప్రధాని సూచనలు పాటించాలన్నారు. విద్యార్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంబురాలు

ఇంద్రవెల్లి: నాగోబా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 12 కోట్ల, 50లక్షల మంజూరు చేసినట్లు జీవో విడుదల చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె నివాసం వద్ద బీఆర్ఎస్ నా యకులు సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'కంటివెలుగు' పరిశీలన



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్ రాజేందర్

ఖానాపూర్: పట్టణంలోని రెండోవార్డు పరిధి శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. శిబిరానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని కోరారు. కమిషనర్ రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గోప సాయినాథ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారంతా శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అబ్దుల్‌కాసీం, నేత్ర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బీరయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: బీడీ కార్మికుల పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. నిర్మల్ మయూరి హోటల్‌లో శుక్రవారం పీఎఫ్ లోకఅదాలత్ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లోకఅదాలత్ జిల్లా ఇన్‌చార్జి బీరయ్యకు కార్మికులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాజన్న మాట్లాడుతూ బీడీ కార్మికుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించకుండా పీఎఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆధార్ ప్రకారం కార్మికుల పేర్లను పీఎఫ్ రికార్డులో సరిచేయాలని కోరారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రామలక్ష్మణ్, జిల్లా జాయింట్ సెక్రెటరీ గంగన్న పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావాలి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల్లోని రైతుల సాగునీటి సమస్యపై ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరుకావాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గోపినర్సయ్య కోరారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్, కడెం మండలాల్లోని సదర్మాట్ ఆయకట్టు చివరి రైతుల సాగునీటి సమస్య, సరస్వతి కాలువ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ 27, 28 పరిధిలోని రైతులకు నీటి విడుదల విషయమై చర్చ ఉంటుందన్నారు. సదర్మాట్ బ్యారేజీ నుంచి సదర్మాట్ ఆనకట్ట వరకు ప్రత్యేక కాలువ ఏర్పాటు విషయంలో పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యారన్నారు. ఈ సమావేశానికి రైతు, ప్రజాసంఘాలు, రాజకీయపార్టీల నాయకులు హాజరవాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు గోనె స్వామి, జి.ప్రసాద్, సునారికారి రాజేశ్ తదితరులు ఉన్నారు.

రేషన్‌బియ్యం ఇప్పించండి సారూ..



ఆర్ఐకు విన్నవిస్తున్న గ్రామస్తులు

పెంబి: తమకు రేషన్‌బియ్యం ఇప్పించాలని మండలంలోని ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన 12 కుటుంబాల మహిళలు శుక్రవారం పెంబి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ హ స్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గుమ్మెనకు చెందిన రేషన్ డీలర్ ఈనెల బియ్యం ఇవ్వలేదని.. అడిగితే అయిపోయాయని సమాధానం దాటవేస్తున్నాడని వాపోయారు. పేదకుటుంబాలకు చెందిన తమకు రేషన్‌బియ్యమే దిక్కని అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. పద్మ, గంగామణి, ఎల్లయ్య, కవిత, భూమయ్య, యాను, రజిత, గంగవ్వ, పోశవ్వ, గంగవ్వ, ఎల్లవ్వ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ఆదమరిస్తే అంతే గతి



సారంగపూర్: మండలంలోని జామ్‌లో సబ్‌స్టేషన్ ఎదురుగా నిర్మల్-స్వర్ణ ప్రధాన రహదారి పక్కన టీఫైబర్ నెట్ వేసేందుకు గుంత తవ్వి పూడ్చకుండా వదిలేశారు. రాత్రి రాకపోకలు సాగించేవారు అందులో పడి గాయపడుతున్నారు. అధికారులు గుంత పూడ్చివేయించాలని వాహనదారులు వేడుకుంటున్నారు. ప్రశ్నించాల్సిన అధికారి: శారీక్ అలీ, ఆర్అండ్‌బీ ఏఈ, ఫోన్: 9440819092

1 నుంచి అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు

భైంసాటౌన్: భైంసా పట్టణంలో తొలిసారి అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సయ్యద్ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నిర్వహించే ఈ పోటీల్లో మొత్తం 32 జట్లు పాల్గొనేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈనెల 28లోగా ఆసక్తి కల్గిన జట్లు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఫైనల్‌లో గెలుపొందిన జట్టుకు రూ.లక్ష, రన్నరప్ జట్టుకు రూ.50వేల బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8919156511, 9063734200, 7416882243 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈరోజు

విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం పంచాయతీ పరిధిలోని బోరిగాం తండాలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యుడు ప్రేమ్ తెలిపారు. ఉదయం 10.11గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తామని..భక్తులు తరలిరావాలని కోరారు.

ఎల్వత్‌కు ఎమ్మెల్యే రాక

తానూరు: మండలంలోని ఎల్వత్ గ్రామంలో శనివారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరవాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : వీరసింహారెడ్డి
నారాయణ : పఠాన్
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

సమస్యల పరిష్కారంలో కేసీఆర్ విఫలం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



పర్యటనలో మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు

ఖానాపూర్: ప్రజాసమస్యల పరిష్కారంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌నగర్, జేకే నగర్, విద్యానగర్ కాలనీల్లో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను విస్మరించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పి సాగనంపాలన్నారు. కేసీఆర్ కుటుంబపాలన నియంతలా సాగుతుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ హయాంలో కేంద్రంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, నాయిని సంతోశ్, అమరవేణి నర్సాగౌడ్, దేశాయి రాము, పందిరి మోహన్, రవీందర్‌రెడ్డి, ఆనంద్, మహేందర్, అనిల్‌రావు, సత్యనారాయణ, రుస్తుం, రాజేశ్వర్, శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

కేస్లాపూర్‌లో మినీ స్టేడియం ఎక్కడ?



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ నాయకులు చెప్తుతున్న మినీ స్టేడియం ఎక్కడ ఉందని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం జెడ్పీటీసీ ఆర్క పుష్పలతతోపాటు మండల నాయకులు కేస్లాపూర్ నాగోబా జాతరను సందర్శించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మినీ స్టేడియం ఎక్కడ నిర్మించారో చూపించాలన్నారు. ఆసమయంలో రాష్ట్ర గిరిజన సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ (ట్రైకర్) చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జీసీసీ చైర్మన్ రమావత్ వాలియనాయక్‌లు నాగోబా ఆలయంలో పూజలు చేసి వెళ్తున్న క్రమంలో వినతిపత్రం అందించేందుకు వెళ్లారు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం హయాంలో ప్రతిపక్షాలు ప్రశ్నించవద్దా అని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మడావి భీంరావ్, ఆర్క ఖమ్ము, ఆరెల్లి రాజలింగు, చిత్రం రాము, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మామడ: మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిరుపతి, నూతన్‌కుమార్, జాన్‌పాల్ శుక్రవారం తహసీల్దార్ ఆరిఫాకు ఫిర్యాదు చేశారు. యూరియాను అధిక ధరకు విక్రయిస్తే రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.